# రేషన్ సరఫరా అస్తవ్యస్తం

**రేషన్‌కు కూటమి ప్రభుత్వం కత్తెర**

- బియ్యం మాత్రమే పంపిణీ
- అరకొరగా కందిపప్పు, చక్కెర సరఫరా
- సక్రమంగా తిరగని ఎండీయూ వాహనాలు
- 5వ తేదీ నుంచే రేషన్ దుకాణాలు మూత
- బియ్యం కూడా అందక అల్లాడుతున్న పేదలు

**ఆత్మకూరు/కొండాపురం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. చౌకదుకాణాల ద్వారా బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తున్నారు. మిగిలిన చక్కెర, కందిపప్పు సరుకుల్లో కోత విధిస్తున్నారు. ఎండీయూ వాహనాలు సైతం సక్రమంగా తిరగడం లేదు. రేషన్ దుకాణాలను 5వ తేదీ నుంచే మూసేస్తున్నారు. దీంతో బియ్యం కూడా అందక పేదలు అల్లాడుతున్నారు. ఈ పరిస్థితి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో నెలకొంది.

**పేదలు పనులు మానుకుని..**

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు పట్టణంతో పాటు ఆరు మండలాల్లో 83,305 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో 89,030 రేషన్ కార్డులు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా మొదటి వారంలోనే రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దే పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎండీయూ వాహనాలు సక్రమంగా తిరగడం లేదు. రేషన్ షాపుల వద్దకు వెళ్లిన అవి మూసివేసి ఉంటుండడంతో రేషన్ బియ్యం కోసం పేద ప్రజలు పనులు మానుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు పట్టణంలో 23 వార్డులు ఉన్నాయి. వాటి పరిధితో రేషన్ సరుకులు సరఫరా చేసేందుకు గత ప్రభుత్వ హయాంలో 8 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మూడు వాహనాలు మాత్రమే సరఫరా చేస్తున్నాయి. మిగిలిన వాహనాలు గత మూడు నెలలుగా నిలిచిపోయి ఉన్నాయి. వాహనాలు తిరగని ప్రాంతాలకు చెందిన ప్రజలు రేషన్ దుకాణాల వద్దకు సరుకులు తీసుకునేందుకు వెళ్తే 5వ తేదీ నుంచే మూసేసి ఉంటున్నాయి. ప్రతి నెలా 18వ తేదీ వరకు రేషన్ సరఫరా చేయాలి. ఈ విషయమై రేషన్ డీలర్లను ప్రశ్నిస్తే బియ్యం స్టాక్ అయిపోయిందని, మూసేశామని చెబుతున్నారని పేద ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇతర ప్రాంతాల్లో రేషన్ బియ్యం సరఫరా చేసే వాహనదారుల వద్దకు వెళితే తమకు కేటాయించిన లబ్ధిదారులకు ఇవ్వడానికే సరిపోతాయని, మిగిలితే ఇస్తామని లేకపోతే రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. బియ్యం కోసం పనులు మానుకుని రోజుల తరబడి ఎండీయూ వాహనాలు లేదా రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూరులోని ఎల్‌ఆర్‌పల్లిలో మూసి ఉన్న రేషన్ దుకాణం

**మళ్లీ మొదలైన కష్టాలు..**

గతంలో రేషన్ లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి గంటల తరబడి క్యూలో నిలబడి సరుకులు తెచ్చుకునే వారు. రేషన్ దుకాణాలు దూరంగా ఉండడం వల్ల సరుకులు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడేవారు. రేషన్‌డీలర్లు అందుబాటులో లేకపోతే పనులు మానుకుని మళ్లీ మళ్లీ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. రేషన్ లబ్ధిదారుల సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గంలో 51 ఎండీయూ వాహనాల ద్వారా సరుకులను ప్రతినెలా మొదటివారంలోనే సరుకులు పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని ప్రాంతాల్లోని వాహనాలు నిలిచిపోవడంతో మళ్లీ లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆత్మకూరులోని ఎల్‌ఆర్‌పల్లి చేనేత కాలనీ, తదితర ప్రాంతాల్లో గతంలో వాశిలికి చెందిన ఎండీయూ ఆపరేటర్ రేషన్ సరుకులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ వాహనం నిలిచిపోవడంతో ఆ ప్రాంత రేషన్ దుకాణాన్ని మెప్మా ఆర్పీకి ఇచ్చారు. ఆమె తన ఆర్‌పీ విధులు ముగించుకుని అనువుగానీ వేళల్లో రేషన్ దుకాణం తెరుస్తోంది. దీంతో సరుకులు తీసుకోవడం ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలా పట్టణంలోని పలు ప్రాంతాల్లో పదహారు రోజులు గడిచినా రేషన్ సరఫరా పూర్తిస్థాయిలో జరగలేదు. పట్టణంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**బియ్యంతోనే సరిపెట్టేస్తున్నారు**

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అడ్డూ అదుపు లేకుండా హామీలను గుప్పించింది. కందిపప్పు, గోధుమలు, చక్కెర, నూనెలను రాయితీపై అందిస్తామని ప్రగల్భాలు పలికింది. ప్రస్తుతం బియ్యం తప్ప మిగిలిన సరుకులను పంపిణీ చేయడం లేదు. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, చక్కెర, గోధుమపిండి పంపిణీ చేయాల్సి ఉంది. గడిచిన ఐదు నెలల నుంచి రేషన్ లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో కందిపప్పు పంపిణీ చేయడం లేదు. 40 నుంచి 50శాతం మందికి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఈ నెలలో ఒక్క శాతం మందికి కూడా కందిపప్పు పంపిణీ చేయలేదు. చక్కెర పరిస్థితి కూడా అంతే. మిగిలిన సరుకులను పూర్తిస్థాయిలో కోత వేశారు. దీంతో పేదలు బయట మార్కెట్‌లో అధిక ధరకు కందిపప్పు కొనుగోలు చేయలేక అల్లాడిపోతున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకుల్లో ఏ నెల ఏ సరుకు సరఫరా నిలిచిపోతుందో అర్థం కావడం లేదని రేషన్ లబ్ధిదారులు వాపోతున్నారు.

**ఉదయగిరి నియోజకవర్గం**

| మండలం | రేషన్ కార్డులు | రేషన్ షాపులు | ఎండీయూ వాహనాలు |
|---|---|---|---|
| కొండాపురం | 12,223 | 34 | 8 |
| జలదంకి | 14,866 | 33 | 9 |
| ఉదయగిరి | 10,588 | 38 | 6 |
| సీతారామపురం | 7,025 | 24 | 5 |
| దుత్తలూరు | 8,078 | 22 | 5 |
| వరికుంటపాడు | 9,178 | 34 | 6 |
| వింజమూరు | 12589 | 26 | 7 |
| కలిగిరి | 14,482 | 35 | 8 |

**ఆత్మకూరు నియోజకవర్గం**

| మండలం | రేషన్‌షాపులు | రేషన్‌కార్డులు |
|---|---|---|
| ఆత్మకూరు | 37 | 18,898 |
| మర్రిపాడు | 35 | 13,834 |
| సంగం | 33 | 14,585 |
| చేజర్ల | 36 | 11,252 |
| ఏఎస్‌పేట | 26 | 10,788 |
| అనంతసాగరం | 37 | 13,948 |

**బియ్యం అందడం లేదు**



గతంలో కాలనీలోకి రేషన్ బండి వచ్చేది. బియ్యంతో పాటు సరుకులు కూడా అన్నీ ఇచ్చేవారు. ఈ మధ్య బండి రావడం లేదు. రెండు కిలోమీటర్ల దూరం నడిచి రేషన్‌దుకాణం వద్దకు వెళ్లి బియ్యం అడిగితే అయిపోయాయని చెబుతున్నారు. మాకు ఇవ్వకుండానే బియ్యం ఎలా అయిపోయాయి. బియ్యం కొనుగోలు చేసే శక్తి మాకు లేదు. అధికారులు స్పందించి బియ్యం సక్రమంగా అందేలా చూడాలి.

– పోట్లూరి రమణమ్మ, గిరిజనకాలనీ, ఆత్మకూరు

**రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు**



గత రెండు నెలలుగా బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కంది పప్పు ఇవ్వడంలేదు. అంగడిలో తెచ్చుకుంటున్నాం. అక్కడ ధర ఎక్కువగా ఉంది. ప్రభుత్వం స్పందించి కందిపప్పు అందేలా చూడాలి.

–జీ రాజమ్మ, మర్రిగుంట, కొండాపురం మండలం

**రేషన్ సక్రమంగా అందేలా చర్యలు**

రేషన్ పంపిణీపై ఆరోపణలు వస్తున్న మాట వాస్తవమే. సీఎస్‌డీటీలతో వెంటనే సమావేశం నిర్వహించి రేషన్ సరుకుల పంపిణీపై సమీక్షిస్తాం. రేషన్ లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం.

– సుధీర్, తహసీల్దార్, ఆత్మకూరు

## క్లుప్తంగా

### వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



**ఉదయగిరి :** మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో పోతురాజు సమేత గంగమ్మ విగ్రహాల ప్రతిష్ఠను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొని గంగమ్మను దర్శించుకున్నారు. జెడ్పీటీసీ రామాంజనేయులు, మూలే వినయ్‌రెడ్డి, పాముల రమణయ్య పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



**సోమశిల:** అనంతసాగరం మండలం పడమటికంభంపాడు పంచాయతీ హరిజనవాడకు చెందిన నాగిపోగు తిరుపాలు, వడ్డిపాళేనికి చెందిన మల్లి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో వారి పిల్లల భవిష్యత్‌కు భరోసాగా హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు ఆదివారం రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. హెల్పింగ్ హార్ట్స్ వ్యవస్థాపకులు ఆర్ వెంకటరమణారెడ్డి, కార్యదర్శి కత్తి పెంచలయ్య, సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా వార్షికోత్సవం



**ఆత్మకూరు:** మున్సిపల్ పరిధిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపల్ టీ కామేశ్వరి ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. దాత కంచి పరమేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై త్వరలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయినులు సంతోషసుమ, తదితరులు పాల్గొన్నారు.

### మద్యం షాపులో చోరీ

**ఉదయగిరి:** ఉదయగిరిలోని మద్యం దుకాణంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వెనుక వైపు ఉన్న కిటికీని తొలగించి దొంగలు లోపలికి ప్రవేశించారు. నగదు ఏమీ లేకపోవడంతో కొన్ని మద్యం సీసాలతో పాటు చిల్లర నగదు, సీసీకెమెరా, హార్డ్‌డిస్కులను తీసుకెళ్లారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

### జూదరుల అరెస్ట్

**ఆత్మకూరు:** రామస్వామిపల్లి శివార్లలో ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్న వారిపై ఎస్సై షేక్ జిలానీ తన సిబ్బందితో దాడి చేశారు. నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.47,500 స్వాధీనం చేసుకున్నారు.

### బాలాలయ నిర్మాణానికి భూమిపూజ



**సోమశిల:** అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ ఉప్పల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాలాలయ నిర్మాణానికి భూమి పూజను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి బాలాలయ నిర్మాణ పనులు మొదలవుతాయని చెప్పారు. ఏప్రిల్ మొదటి వారంలో కళార్షణ, ప్రధాన ఆలయ భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ పునర్నిర్మాణ మ్యాపును పరిశీలించారు. ప్రధాన అర్చకులు రామకృష్ణశర్మ, ఆలయ ఈఓ ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరావు, ఏఈ మురళీ మోహన్, స్థపతి పీ సురేంద్ర పాల్గొన్నారు.

### ఇంట్లో చోరీ

**కావలి:** పట్టణంలోని ముసూరులోని వాకా రవి కుమార్‌రెడ్డి ఇంట్లో దొంగలు పడి మూడు సవర్ల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ నెల 14న రవికుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం క్షేత్రానికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి ఆయన చోరీని గుర్తించి కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కోడిపందేల స్థావరంపై దాడులు

**కావలి:** మండలంలోని చినరాముడుపాళెంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై రూరల్ ఎస్సైలు బాజీబాబు, తిరుమలరెడ్డి ఆదివారం దాడులు నిర్వహించారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కోడిపుంజు, రూ.1080 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేశారు. కాగా పోలీసుల దాడుల సమాచారం నిర్వాహకులకు ముందుగా తెలియడంతో వారు అక్కడికి చేరుకునేలోగానే పెద్దసంఖ్యలో ఉన్న పందెంరాయుళ్లు పలాయనం చిత్తగించారు. ఈ విషయమై పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే

- పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

**ఉదయగిరి:** భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ఉదయగిరి నియోజవర్గ పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంగళరావు నగర్‌లో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల పాలనలో అన్ని రకాలుగా వైఫల్యం చెందిందన్నారు. సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధిని గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. టీడీపీ అరాచకాలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మేకపాటితో పాటు పలువురు నేతలను మాజీ ఎంపీటీసీ పాము ల రమణయ్య ఘనంగా సన్మానించారు. పార్టీ మండలాధ్యక్షుడు గానుగపెంట ఓబులరెడ్డి, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, నేతలు షేక్ అలీ అహ్మద్, మూలే వినయ్‌రెడ్డి, జీ వెంగళరెడ్డి, ఎం తిరుపతినాయుడు, అబ్దుల్, దిలీప్, ఖాజాహుస్సేన్, అక్కులరెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

## రూ.85లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం


**సీతారామపురం:** మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో జనరల్ ఫండ్ నిధులు రూ.2.20 కోట్లతో సీసీ రోడ్లు, రచ్చ అరుగుల నిర్మాణంతో పాటు తాగునీటి పథకాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.85లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశామని చెప్పారు. సిద్ధేశ్వరంలో రూ.10 లక్షలు, పోలంగారిపల్లిలో రూ.5 లక్షలు, బసినేనిపల్లిలో రూ.15 లక్షలు, నెమళ్లదిన్నెలో రూ.10 లక్షలు, అయ్యవారిపల్లిలో రూ.10 లక్షలు, దేవిశెట్టిపల్లిలో రూ.5 లక్షలు, సంగసానిపల్లిలో రూ.5 లక్షలు, సింగారెడ్డిపల్లిలో రూ.10 లక్షలు, సీతారామపురంలో రూ.10 లక్షలు, గంధంవారిపల్లిలో రూ.5 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, ఎంపీటీసీలు పీసీ అల్లూరురాజు, శారమ్మ, చప్పిడి వెంకటమ్మ, అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, వెంకటరెడ్డి, గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లకిడి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ అబ్రహం, ఖాసీంపీరా, బాలినేని మాబయ్య, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ పద్మావతి

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

**అల్లూరు:** వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత మండలాధికారులు శాఖలవారీగా ప్రగతిని చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకెళితే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఆ దిశగా అధికారులకు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ రజనీకాంత్, జెడ్పీటీసీ వేణమ్మ, వైస్‌ఎంపీపీ కొండూరు వాసు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి

## టిడ్కో గృహ సముదాయానికి బస్సు సౌకర్యం

**కావలి:** జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు పట్టణంలోని ఉత్తర శివారుప్రాంతం మద్దూరుపాడులో ఉన్న టిడ్కో గృహసముదాయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ప్రతిరోజూ కావలి బస్టాండ్‌లో ఉదయం 7.15 గంటలకు బస్సు బయలుదేరి టిడ్కో గృహాల వద్దకు 7.30 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి 7.40 గంటలకు బయలుదేరి కావలికి 7.55 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. అలాగే సాయంత్రం 5.30 గంటలకు కావలి బస్టాండ్ నుంచి బయలుదేరి 5.45 గంటలకు టిడ్కో గృహాల వద్దకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 5.50 గంటలకు బయలుదేరి కావలి బస్టాండ్‌కు చేరుకుంటుందని వివరించారు.కాగా సోమవారం నుంచి జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు డీఎం తెలిపారు.

## త్యాగధనుడు పొట్టిశ్రీరాములు



కావలి:అమరజీవికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చేజర్ల: ఆదూరుపల్లిబస్టాండ్‌సెంటర్‌లో..



సోమశిల: అనంతసాగరం గ్రంథాలయంలో..



దుత్తలూరు: తహసీల్దార్ కార్యాలయంలో..

**కావలి:** పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో అమరజీవి చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగానే తెలుగు ప్రజలకు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందని, ఆయన త్యాగం మరువలేనిదన్నారు. నేటి తరానికి అమరజీవి త్యాగాన్ని తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, నల్లూరు రమేష్, చీదెళ్ల కిషోర్ గుప్తా, అమరా శ్రీనివాసులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, నందనవనం సీతాలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు,

**దుత్తలూరు:** మండల తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవి చిత్రపటానికి సీనియర్ అసిస్టెంట్ సంధానిబాషా పూలమాల వేసి నివాళులర్పించారు.

**సోమశిల:** అనంతసాగరం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పొట్టిశ్రీరాములు జీవిత విశేషాలను వివరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో అమరజీవికి ఘనంగా నివాళులర్పించారు.

**చేజర్ల:** ఆదూరుపల్లి బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి దేవతి రమేష్ బాబు, పువ్వాడి శ్రీనివాసులునాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భానుతేజ, వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## వివాదాస్పద భూమిలోని పంటకోత

**ఆత్మకూరు:** అనంతసాగరం మండలం లింగంగుంటలో వివాదాస్పద భూమిలోని పంట కోత విషయమై ఆదివారం ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది.వివరాలు.. బెడుసుపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 268-2లోని 3.67ఎకరాల భూమి విషయంలో లింగంగుంటకు చెందిన సాలవ చిన్నమ్మ, అదే గ్రామానికి చెందిన మెట్టుకూరు వెంకటేశ్వరరెడ్డి నడుమ వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో చిన్నమ్మ రెవెన్యూకోర్టును ఆశ్రయించగా భూమిపై 145 సీఆర్పీ అమలు చేసింది. కాగా వివాదస్పద భూమిలోని పంటను వెంకటేశ్వరరెడ్డి ఆదివారం కోస్తుండగా, కోర్టులో కేసు నడుస్తుండగా ఎలా కోస్తారని చిన్నమ్మ అడ్డుకోవడంతో ఇరువురి నడుమ వివాదం నెలకొంది. ఈ విషయమై తహసీల్దారు సుభాషిణిని వివరణ కోరగా కోతకు వచ్చిన పంట పాడైపోతుందని జేసీ ఆదేశాల మేరకు 145 సీఆర్పీని శనివారం ఎత్తివేసి పంట సాగుచేసిన వారికి కోసుకునేందుకు అనుమతించామని తెలిపారు. కాగా రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే రెవెన్యూ అధికారులు ఇలాంటి చర్యలు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## విజయీభవ

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఉదయగిరి నియోజకవర్గంలో హాజరుకానున్న 3186 మంది విద్యార్థులు
- ఒత్తిడిని అధిగమిస్తేనే మంచి ఫలితాలు
- హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**దుత్తలూరు:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలో 3186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.ఈ నెల 31వ తేదీ వరకు జరిగే పరీక్షలకు విద్యాశాఖ పగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధిస్తే విద్యార్థి తన జీవితంలో తొలిమెట్టు ఎక్కినట్లే. ఏ ఉద్యోగానికైనా కనీస అర్హత పదో తరగతి ఉత్తీర్ణతే ప్రామాణికం. అయితే తొలిసారిగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో ఏదో తెలియని భయం సహజంగా ఉంటుంది. ఆందోళన వీడి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉంటుందని విద్యానిపుణులు సూచిస్తున్నారు. ఏడాదిపాటు చదివిన విషయాలను రెండు గంటల పరీక్షలో నిరూపించుకోవాల్సి ఉంటుంది. మంచి మార్కులు సాధించాలన్నా, విజేతలుగా నిలవాలన్నా ప్రణాళిక ఎంతో ముఖ్యం. ముందుగా విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి స్వేచ్ఛగా ఆలోచించి రాస్తే విజయం సులభమవుతుంది. కొంతమంది విద్యార్థులు కొన్ని ముఖ్యమైన ప్రశ్నల పట్టికను తయారు చేసుకుని వాటి జవాబులు మాత్రమే నేర్చుకుంటుంటారు. కానీ ఒక్కోసారి ఊహించని ప్రశ్నలు పరీక్షల్లో ఎదురవుతాయి. అప్పుడు పరిస్థితి తారుమారవుతుంది. ఉన్న కొద్దిపాటి సమయాన్ని సద్వినియోగం చేసుకుని అధిక శాతం ప్రశ్నలకు జవాబులు నేర్చుకోవడం ఉత్తమమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నేర్చుకున్న విషయాలను రివిజన్ చేసుకోవడం కూడా ఎంతో ముఖ్యం. ఎప్పుడైతే అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన పెంచుకుంటారో ఆత్మవిశ్వాసం దానంతట అదే దరిచేరుతుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్లు సైతం నిర్వహించారు.

**పరీక్ష కేంద్రానికి ముందస్తుగా ..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.ఉదయం 9.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌లో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. పరీక్ష రాసే సమయంలో సమయాన్ని పాటించడం కూడా చాలా ముఖ్యం.

**ఉచిత ప్రయాణ సౌకర్యం**

ప్రభుత్వం పదోతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను చూపించి బస్సుల్లో ఉచితంగా కేంద్రాలకు చేరుకోవచ్చు.



ఉదయగిరిలోని సెయింట్ మేరీస్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

**పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి**



పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా చక్కగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి.

–వెంగయ్య, ఎంఈఓ, దుత్తలూరు

**ఉదయగిరి నియోజకవర్గంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలు**

| మండలం | పరీక్ష కేంద్రాల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| దుత్తలూరు | 3 | 469 |
| సీతారామపురం | 1 | 259 |
| ఉదయగిరి | 5 | 529 |
| వింజమూరు | 5 | 650 |
| వరికుంటపాడు | 1 | 237 |
| కలిగిరి | 2 | 391 |
| జలదంకి | 2 | 315 |
| కొండాపురం | 2 | 336 |